ముత్తుకూరుకు నూతన కళ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ముత్తుకూరుకు నూతన కళ సంతరించుకుంది. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలకు పరిష్కారం లభించింది. గతంలో జన్మభూమి కమిటీల వల్ల కొందరికే సంక్షేమ పథకాలు అందేవి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు జరుగుతోంది.

- అడుగడుగునా అభివృద్ధి
- రూ కోట్ల నిధులతో ప్రగతి పనులు
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ముత్తుకూరులో నూతన సచివాలయ భవనం

ముత్తుకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ సచివాలయాల ద్వారా అడుగడుగునా అభివృద్ధి పనులు దర్శనమిస్తున్నాయి. రూ.లక్షల్లో విలువైన ప్రగతి ఫలాలు గ్రామాలను అలంకరించాయి. పంచాయతీల రూపురేఖలే మారిపోయాయి. ముఖ్యంగా మేజర్ పంచాయతీ అయిన ముత్తుకూరులో ప్రతి వీధిలో సీసీరోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం జరిగాయి. పంచాయతీ కార్యాలయం స్థానంలో రూ.40 లక్షలతో సచివాలయ భవనం ఏర్పాటైంది. దీని చెంతనే రైతు భరోసా కేంద్రం నిర్మాణమవుతోంది. మత్స్య ఉత్పత్తుల అమ్మకాల కోసం రూ.50 లక్షలతో ఫిష్–చికెన్ మార్కెట్ భవన నిర్మాణం చేశారు. మరోవైపు ఏళ్ల తరబడి అడవిని తలపించే ముస్లింల శ్మశానవాటిక రూ.25 లక్షల వ్యయంతో సర్వాంగ సుందరంగా తయారైంది. ఈ ప్రదేశం చుట్టూ ప్రహరీని నిర్మించి, విద్యుత్ కాంతుల మధ్య ఈద్గా మైదానం నిర్మించారు. 219 పక్కాగృహాలు ఒక వైపు, 74 పక్కా ఇళ్లు మరో వైపు జగనన్న కాలనీల పేరిట కొత్త ఊర్లు వెలిశాయి. ఇక నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాలు కొత్త హంగులు దిద్దుకున్నాయి. గతంలో ఏ ప్రభుత్వ పాలనలో జరగని విధంగా సర్వేపల్లి శాసనసభ్యుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన కృషి ఫలితంగా ఐదేళ్ల పాలనలో రూ.26.68 కోట్ల మేరకు అభివృద్ధి పనులు జరిగాయి.

ముత్తుకూరు బిట్-1 సచివాలయ పరిధిలో..

నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారులకు జరిగిన మేలు
రూ.10,07,82,772

డీబీటీ ద్వారా జరిగిన మేలు
రూ.16,60,67,875

మొత్తం
రూ.26,68,50,647

మంత్రి సహకారం మరువలేనిది



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సహకారంతో ముస్లింల చిరకాల కోరిక నెరవేరింది. ముళ్ల చెట్లతో నిండిన ప్రాంతంలో ఈద్గా మైదానం, శ్మశాన వాటిక వీటి చుట్టూ ప్రహరీ నిర్మాణమైంది.
– అబ్దుల్ రహీమ్, మైనార్టీ నాయకుడు

మును పెన్నడూ లేని అభివృద్ధి



ముత్తుకూరులో గతంలో ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి పనులు సీఎం జగనన్న పాలనలో జరిగింది. మంత్రి కాకాణి గోవర్ధనన్న కృషితో ఎన్నో అభివృద్ధి పనులు జరగడం సంతోషంగా ఉంది.
– బూదూరు లక్ష్మి, సర్పంచ్, ముత్తుకూరు

అవసరమైన పనులు జరిగాయి



ఈ ఐదేళ్ల పాలనలో ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరిన పనులన్నీ ముత్తుకూరులో సజావుగా జరిగాయి. ఈ ప్రగతి వెనుక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డిల కృషి చాలా ఉంది.
– గండవరం సుగుణ, ఎంపీపీ, ముత్తుకూరు


నూతన ఫిష్–చికెన్ మార్కెట్


ముస్లింల సుందర ఈద్గా మైదానం

నేడు గురివిందపూడికి మంత్రి కాకాణి రాక

మనుబోలు : మండలంలోని గురివిందపూడి గ్రామానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం వస్తారని గ్రామ సర్పంచ్ మన్నెమాల సమతమ్మ సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభిస్తారని, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మరుపూరు చెరువులకు సాగునీరు

పొదలకూరు : కండలేరు ఎడమగట్టు కాలువ ద్వారా మండలంలోని మరుపూరు చెరువులకు సోమవారం నుంచి సాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామంలో సుమారు 500 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. చెరువుల్లో నీరు అడుగంటుతున్న సమయంలో రైతులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన కాలువ ద్వారా చెరువులకు సాగునీటిని అందిస్తున్నారు. నాలుగు రోజుల పాటు చెరువుల్లోకి నీటిని సరఫరా చేస్తారని గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. చెరువుల్లో తిరిగి జలకళ సంతరించుకోవడంతో రైతులు మంత్రికి కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.

ఈఓపై దేవదాయ శాఖ ఏసీకి ఫిర్యాదు

ఇందుకూరుపేట : గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయ కార్యనిర్వహణాధికారి(ఈఓ) బండి శాంతయ్యపై గ్రామస్తులు సోమవారం దేవదాయ శాఖ ఏసీకి ఫిర్యాదు చేశారు. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా ఈఓ పనులు చేపడుతున్నారన్నారు. ఆలయానికి సంబంధించిన కార్యకలాపాల్లో అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. అలాగే ఆలయ ఆవరణలో నిర్మాణ పనులను ఇష్టానుసారం చేపడుతున్నాడని, దీనివల్ల పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. ఆయనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

వైభవంగా నారాయణస్వామి ఆరాధనోత్సవం


నారాయణస్వామి సమాధి వద్ద ప్రత్యేక పూజలు

పొదలకూరు : పొదలకూరు సమీపంలోని చిట్టేపల్లి తిప్ప దేవగిరి క్షేత్రం వద్ద వెంకయ్యస్వామి ప్రథమ శిష్యుడు నారాయణస్వామి 16వ ఆరాధన మహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉదయం 9 నుంచి నిత్యపూజ అనంతరం విఘ్నేశ్వర పూజ, నవగ్రహారాధన, శ్రీలక్ష్మీగణపతి హోమం, ఓం నారాయణ ఆదినారాయణ హోమం, పూర్ణాహుతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు, రాత్రి 8 గంటలకు అన్నప్రసాదాలను భక్తులకు అందజేశారు. భజనలు, నామసంకీర్తలు, రాత్రి 8 గంటలకు జాదుఘర్ టైగర్ మహ్మద్ మెజీషియన్ టీమ్ వారిచే మ్యాజిక్ షో, మాట్లాడే బొమ్మ హాస్యవల్లరి జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు గుండ్రా జనార్దన్‌రెడ్డి దంపతులు, తరుగు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


వైద్యులతో మాట్లాడుతున్న విజయభారతి

కోవూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సూచించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. వైద్యశాలలో సర్జికల్ వార్డు, ఆపరేషన్ థియేటర్, మరుగుదొడ్లు, ఆయుర్వేద వైద్యశాల విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. ఓపీల సంఖ్య, మందులు, వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సినిమా షూటింగ్ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): ప్రతిభగల నవతరం నటీనటులను చలనచిత్ర రంగంతో పాటు ప్రేక్షకులు ఆదరించాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. డివైన్‌స్టార్ సుమన్ సమర్పణలో సుఫియా పర్వేజ్ ప్రధాన పాత్రలో హీరో ప్రవీణ్ నటిస్తున్న ''సాహసం' చిత్రం షూటింగ్‌ను సోమవారం ప్రారంభించారు. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమరావతి కృష్ణారెడ్డి క్లాప్‌కొట్టి, కెమెరా స్విచ్ ఆన్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శకుడు రషీద్‌తో నటుడు సుమన్‌కు 40 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. సాహసం తరువాత రషీద్ దర్శకత్వంలో సుమన్ హీరోగా జీ రిషికుమార్‌రెడ్డి నిర్మాతగా భారీ బడ్జెట్ సినిమా రూపుదిద్దుకోనుందని వెల్లడించారు. తెలుగుతెరకు సుఫియా పర్వేజ్ హీరోయిన్‌గా పరిచయం కానుందన్నారు. దర్శకుడు రషీద్ మాట్లాడుతూ అమరావతి కృష్ణారెడ్డి ఆశీస్సులతో నటుడు సుమన్ సహకారంతో చిత్రనిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. చిత్రనిర్మాత సుబ్బారావు,నెల్లూరు సినిమా అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ శివలంకి, 25కళాసంఘాల కన్వీనర్లు దొర్నాల హరిబాబు, అమీర్‌జాన్, ఎస్ హరనాథ్‌రెడ్డి మూవీఆర్టిస్ట్ అసోసియేషన్ నిర్వాహకులు ప్రశాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శైలజ, నాగేశ్వరరావు, రెమో, రామ్‌ప్రసాద్, వెంకటేష్, డీఓపీ ప్రవీణ్, నటీనటులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): పోలీసులకు ఫిర్యాదు చేశారన్న అనుమానంతో ఓ వృద్ధుడిపై కొందరు యువకులు హత్యాయత్నం చేసిన ఘటన నెల్లూరులోని సంతపేటలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సంతపేటలో గోవర్ధన్ కుటుంబం నివాసం ఉంటోంది. వృద్ధుడి ఇంటికి సమీపంలో ఉన్న స్థలంలో అదే ప్రాంతానికి చెందిన దస్తగిరి, మస్తాన్, ఉమర్, అజిత్, కుల్లా, నవీద్ నిత్యం మద్యం తాగి అల్లరి చేస్తుండేవారు. ఇటీవల పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని మందలించారు. గోవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్న అనుమానంతో వారు కక్ష పెంచుకున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి గోవర్ధన్ తన కొడుకుతో కలిసి ఇంటి ముందు మాట్లాడుతుండగా నిందితులు రాళ్లతో, రాడ్లతో దాడి చేశారు. గాయాలపాలైన ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

విశ్వసనీయతకు మారుపేరు వలంటీర్లు


పురస్కారం అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రామ, వార్డు వలంటీర్లు విశ్వసనీయతకు మారుపేరు అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ వరుసగా నాలుగో ఏడాది వలంటీర్లను సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అవినీతికి తావులేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను వారి ముంగిటకు చేర్చుతున్న వలంటీర్ల సేవలను ఎంత పొగిడినా తక్కువేనన్నారు. నవరత్నాల అమలులో వలంటీర్ల పాత్ర చాలా కీలకమని కొనియాడారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలు అందించిన తీరు ప్రశంసనీయమన్నారు. ఇదేవిధంగా భవిష్యత్‌లో కూడా ప్రజలకు ఉత్సాహంగా సేవలు చేయాలని వలంటీర్లకు సూచించారు. పేదలకు మంచి చేసే యజ్ఞంలో వలంటీర్ల సేవలు చిరకాలం కొనసాగేలా మరింత ప్రోత్సహిస్తూ నగదు పురస్కారాల మొత్తాన్ని పెంచినట్లు తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో ఐదుగురు సేవావజ్ర, 25 మందికి సేవారత్న, 1,744 మందికి సేవామిత్ర పురస్కారాలకు ఎంపికయ్యారని వివరించారు. కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన


మట్టి నమూనాల సేకరణను వివరిస్తున్న అధికారులు

కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య ట్రైబల్ మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు ఆత్మ పథకం ద్వారా భూసార పరీక్షలపై సోమవారం అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు సేకరించడం, వాటిని ప్రయోగశాలలో విశ్లేషించడంపై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆత్మ పీడీ దొరసాని మాట్లాడుతూ భూసారాన్ని మేరకు దిగుబడులు ఆధారపడి ఉంటాయన్నారు. ఇందులో నత్రజని, భాస్వరం, పొటాష్, సేంద్రియ కర్బనాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు సూక్ష్మ దాతు పోషకాలైన జింక్, ఇనుము, మెగ్నీషియం, బోరాన్, మాంగనీసుల ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే భూసారంపై అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు సొంతంగా మట్టి నమూనాలు సేకరించడం, ప్రయోగశాలలో విశ్లేషించడంపై భూసార ప్రయోగశాల ఏడీఏ కె.కన్నయ్య, ఏఓలు జ్యోత్స్న, డి.కల్యాణి, కేవీకే శాస్త్రవేత్త అనూష వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ డీడీఏ శివనారాయణ, గురుకులం ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ, వీఏఏలు డి.నవీన్, ఒ.సుజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న రవాణా శాఖ ఉప కమిషనర్ చందర్

కోవూరు : రహదారి భద్రత ప్రతిఒక్కరి బాధ్యత అని, దీనిని ప్రతిఒక్కరూ పాటించాలని రవాణశాఖ ఉప కమిషనర్ చందర్ అన్నారు. కోవూరులోని లారీ యార్డ్ అసోసియేషన్ కార్యాలయంలో రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో నెల రోజుల పాటు రోడ్డు ప్రమాదాలు తదితర విషయాలపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా డ్రైవర్ల అతివేగం, ఓవర్ టేక్ కారణంగానే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రధానంగా లారీ డ్రైవర్లు డ్రైవింగ్ చేసే సమయంలో కుటుంబసభ్యులను జ్ఞాపకంలో పెట్టుకుంటే చాలావరకు ప్రమాదాలు జరగవన్నారు. జిల్లాను రోడ్డు ప్రమాద రహితంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. కావలి ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల శాతాన్ని తగ్గించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం రూ.3 లక్షల వరకు ఉచిత బీమా బాండ్లను పది మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, కార్యదర్శి నారాయణ, ఎంవీఐలు బాలమురళి, స్వప్నీల్‌రెడ్డి, అసోసియేషన్ నేతలు, వైద్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


చేపల మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనికేపల్లి పంచాయతీ పరిధిలో నక్కలవాగుపై రూ.2.5 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని, రూ.25 లక్షలతో నిర్మించిన చేపల మార్కెట్‌ను, వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో రూ.19.54 కోట్లతో నిర్మించనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలను మంత్రి కాకాణి సోమవారం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ప్రజలకు అచరణ సాధ్యం కాని వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. రైతులకు, మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు, ఆ ఊసే లేకుండా పాలన చేయడంతో 2019 ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి ఇంటికి పంపారని తెలియజేశారు. సిద్ధం సభలలో జనం హాజరయ్యే తీరు మరోసారి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు నిదర్శనమన్నారు.

దోచుకోవడం, దాచుకోవడం సోమిరెడ్డి నైజం


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు మంత్రి కాకాణి తెలియజేశారు. అయితే ఈ ప్రాంతంలో అనేక దఫాలు మంత్రిగా వెలగబెట్టిన సోమిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేయలేదన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవాలని కుట్రలు చేసిన నీచమైన వ్యక్తి సోమిరెడ్డి అని మండిపడ్డారు. నక్కలకాలువను అభివృద్ధి చేసి వెంకటాచలం, ముత్తుకూరు మండలాల రైతుల సమస్యను పరిష్కరిస్తే, వాటినీ అడ్డుకోవాలని సోమిరెడ్డి చూడటం సిగ్గు చేటన్నారు. ఒక్క అనికేపల్లి పంచాయతీలోనే సీసీరోడ్లు, సైడు కాలువలు, ఇతర అభివృద్ధి పనులను రూ.32.86 కోట్లతో పూర్తి చేశామని వివరించారు. వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఏఎంసీ మండల చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, సర్పంచ్ శీనమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఎం.సుమతి, ఎం.రమణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

విడవలూరు: మండలంలోని వావిళ్ల గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ ఉప విద్యాశాఖాధికారిణి ప్రసన్నలక్ష్మి హాజరై శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్కూల్ హెచ్ఎం వై.చెంచురామయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఛత్రపతి శివాజీ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ


కంటేపల్లిలో ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ బృందం

వెంకటాచలం: మండలంలోని కంటేపల్లిలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో తిరిగి నీటిని ఎలా పొదుపుగా వాడాలి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, బాలికా విద్య తదితర అంశాలపై నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ కె.సునీత, సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు బి.వి సుబ్బారెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీధర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అట్రాసిటీ కమిటీ మెంబర్‌గా ప్రవల్లిక


ప్రవల్లికను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్‌గా బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన బట్టా ప్రవల్లిక ఎంపికైంది. బుచ్చిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేసి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని వివరించారు.